# సంతృప్తి

**-బులుసు రాధాకృష్ణమూర్తి**



కిషోర్‌కి చిన్నప్పట్నించీ న్యూ ఇయర్ గ్రీటింగ్స్ ముఖ్యమైన మిత్రులందరికీ పంపడం అలవాటు, సరదా కూడా.

ప్రతి ఏడాది తనకి స్నేహితులు, బంధువులు పంపిన గ్రీటింగ్స్ కూడా చాలా జాగ్రత్తగా దాచుకుంటాడు. అందుకే అతని దగ్గర ఎన్నో రకాల గ్రీటింగ్స్ ఉంటాయి. ఖాళీగా ఉన్నప్పుడల్లా తనకి వచ్చిన గ్రీటింగ్స్‌ని చూసుకుంటూ స్నేహితులందరినీ గుర్తుకు తెచ్చుకుంటూ ఉంటాడు. అతనికి అదొక హాబీ. అయితే రానురాను ఫోన్లోనే గ్రీటింగ్స్ చెప్పడం, సెల్‌ఫోన్ల ద్వారా ఎస్ఎంఎస్‌లు పంపడం వంటివి వాడుకలోకి రావడం వల్ల కిషోర్ స్నేహితులందరికీ గ్రీటింగ్స్ పంపినా వారివద్ద నుంచి స్పందన ఉండడం లేదు.

అందులో ఈరోజుల్లో గ్రీటింగ్స్ పంపడమంటే ఖర్చుతో కూడుకున్న పని. గ్రీటింగ్‌కార్డుల రేట్లు కూడా విపరీతంగా పెరిగిపోవడం వల్ల గ్రీటింగ్స్ కొనడం. పోస్టేజీ కూడా తక్కువేమీ కాకపోవడం వల్ల పోస్టల్ ఖర్చు వగైరా వగైరాతో కిషోర్‌కి వచ్చే గ్రీటింగ్స్ సంఖ్య సంవత్సరం సంవత్సరానికీ తగ్గిపోసాగింది. అయినా కిషోర్ స్నేహితులందరికీ యధావిధిగా గ్రీటింగ్స్ పంపేడు.

"మీ పిచ్చిగానీ, ఎవరికి కావాలండి? అంత మందికి ఎంతో ఖర్చు చేసి పంపిస్తున్నారు. ఎంత మంది తిరిగి మీకు పంపిస్తున్నారు? కనీసం అందిందని ఒక్కరు కూడా ఒక కార్డు మీద కూడా కృతజ్ఞతలు తెలియజేయడం లేదు. మిమ్మల్ని చూస్తే జాలేస్తోంది?'' కిషోర్ భార్య రాధ మనసులో ఉన్న మాట కుండబద్ధలు కొట్టినట్లుగా చెప్పేసింది. అవును. తను సుమారుగా వందమందికి కొత్త సంవత్సరం గ్రీటింగ్స్ పంపేడు.

అయిదారువందలు ఖర్చయింది. ఇద్దరో ముగ్గురో తిరిగి గ్రీటింగ్స్ పంపారు తప్పితే మిగిలినవారంతా కనీసం "నీ గ్రీటింగ్స్ అందాయి. నేను కూడా శుభాకాంక్షలు అందజేస్తున్నాను'' అని కూడా రాయలేదు. ఏం స్నేహితులు? ఏం బంధాలు? కనీస మర్యాదలు కూడా అంతరించిపోతున్నాయి. తను గ్రీటింగ్స్ పంపిన స్నేహితుల నుండి రెస్పాన్స్ కోసం కనీసం పదిహేనురోజులు రోజూ పోస్ట్ కోసం ఎదురుచూశాడు కిషోర్.

ప్చ్.. అతడి ఆశ నిరాశే అయింది. అది వాళ్ల అహంకారం అనుకోవాలా, లేక బద్ధకమనుకోవాలా ఏమీ అంతుచిక్కలేదు కిషోర్‌కి.

ఎంతో ఆప్యాయంగా గ్రీటింగ్స్ పంపినప్పుడు కనీసం గ్రీటింగ్స్ అందేయని చిన్న ఉత్తరం రాయడం కనీస మర్యాద. ఒకరోజు పోస్ట్‌మెన్ అనుకోకుండా ఒక ఉత్తరం ఇచ్చాడు. అది తన క్లాస్‌మేట్ ప్రభాకర్ దగ్గర నుంచి వచ్చింది. అతనిప్పుడు ఢిల్లీలో ఒక పెద్ద కంపెనీకి చీఫ్ జనరల్ మేనేజర్. అతనిక్కూడా గ్రీటింగ్స్ పంపాడు కిషోర్.

ఆ ఉత్తరంలో ప్రభాకర్-

"డియర్ కిషోర్! నువ్వు నన్ను ఇంకా గుర్తుపెట్టుకుని ఎంతో ఆప్యాయంగా పంపిన గ్రీటింగ్స్ అందాయి. నీకు ఎంతమంది పిల్లలు? ఇప్పుడు ఏం చేస్తున్నారు? నీ ఉద్యోగం ఎలా ఉంది? మీ ఫ్యామిలీతో సరదాగా ఒకసారి ఇక్కడికి రాకూడదా? నాలుగురోజులు ఉండవచ్చు. ఢిల్లీలో అన్నీ చూపిస్తాను. నా భార్య కూడా నీకు చాలా చాలా థ్యాంక్స్ చెప్పమంది. మిమ్మల్ని రమ్మనమని రాయమంది. మీ అందరికీ మా నూతన సంవత్సర శుభాకాంక్షలు. నువ్వు ఎప్పుడు వస్తున్నదీ తెలియజేస్తే స్టేషన్‌కి వచ్చి రిసీవ్ చేసుకుంటాను. ఇది సీరియస్‌గా రాస్తున్న మాట. ఏమీ మొహమాటపడవద్దు. ప్లీజ్... ఇంకొకసారి థ్యాంక్స్ చెబుతూ

నీ ప్రియమిత్రుడు

-ప్రభాకర్''

చాలు! ఈ మాత్రంచాలు. ఇన్నాళ్ల తన కల నిజమైంది. అంత పెద్ద ఉద్యోగంలో ఉంటూ ఎంత ఆప్యాయంగా రాసేడు. ఇలాంటి స్నేహితుడొక్కడుంటే చాలు.

"రాధా! చూడు. మీ పిచ్చిగాని అన్నావు కదా! ఉత్తరం ఎక్కడనుండి వచ్చిందో చూడు'' సంతోషంతో ఉక్కిరిబిక్కిరి అవుతూ భార్యని బిగ్గరగా పిలిచాడు కిషోర్.

★